అధ్వానంగా దివీస్ పార్కు

- ప్రమాదకరంగా ఆట వస్తువులు
- గతంలో రూ.2.25 కోట్లతో అభివృద్ధి చేసిన దివీస్ యాజమాన్యం
- అనంతరం పర్యవేక్షణ లేక శిథిలం


సంగివలసలో దివీస్ లేబొరేటరీ యాజమాన్యం నిర్మించిన పార్కు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు సంగివలసలో దివీస్ లేబొరేటరీ నాలుగేళ్ల క్రితం రూ.2.25 కోట్లతో చేసిన అభివృద్ధి పనులపై పర్యవేక్షణ లేకపోవడంతో చాలా వరకు శిథిలమయ్యాయి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు కాలనీని ఆనుకుని ఉన్న చిల్డ్రన్స్ పార్కులో ఆట వస్తువులు చిన్నారుల పాలిట ప్రమాదకరంగా మారాయి. తుప్పుపట్టిన రేకులు, విరిగిన ఇనుప కడ్డీలు, జారుడు బల్లల కారణంగా ఆటలాడుకోవడానికి వచ్చిన పిల్లలు గాయాల పాలవుతున్నారు. ఆటలాడుకునే సమయంలో వీటి మధ్య కాళ్లు, చేతులు, తలలు ఇరుక్కుని రక్తమోడుతున్నారు. చిన్నారుల వెంట వచ్చే తల్లిదండ్రులు విరిగిన, తుప్పుపట్టిన ఆట పరికరాలను చూసి ఆందోళన చెందుతున్నారు. వీటికి మరమ్మతులు చేయించడమో... లేదా పూర్తిగా తొలగించడమో చేయాలని కోరుతున్నారు.


పర్యవేక్షణ కొరవడటమే కారణం..

దివీస్ లేబొరేటరీ రూ.కోట్లు పోసి నిర్మించిన పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, సిమెంట్ బెంచీలు, విశ్రాంతి మందిరాలపై అటు యాజమాన్యం... ఇటు జీవీఎంసీ అధికారులు పట్టించుకోలేదు. దేవదాయశాఖకు చెందిన స్థలంలో ఏర్పాటు చేసిన వీటి పర్యవేక్షణకు ఆ శాఖలో సిబ్బంది కొరత కూడా తీవ్రంగా వేధిస్తుంది. దీంతో ఈ పరిసరాల్లో నిత్యం ఆకతాయిల చేష్టలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జులాయిలు ఇక్కడ తిష్టవేసి మిగిలిన వారికి ఇబ్బంది కలిగిస్తున్నారు.

జుగుప్సాకరమైన వారి చేష్టలతో పలువురు విసుగు చెందుతున్నారు. ఇప్పటికైనా దివీస్ యాజమాన్యం జోక్యం చేసుకుని గతంలో చేసిన అభివృద్ధి పనులకు మరమ్మతులు, చిల్డ్రన్స్ పార్కులో వసతులు కల్పించి బాధ్యతాయుతమైన నిర్వహణను ఎవరికైనా అప్పగించి రక్షించాలని పలువురు కోరుతున్నారు.



ఇనుప రేకులు శిథిలమై రంధ్రాలు పడిన ఆట వస్తువులు


జారుడు బల్లపై రంధ్రం


ఒకవైపు విరిగిన తూగుడు బల్ల

నాటు బాంబు పేలి గోమాత విలవిల

చిప్పాడ కొండపై దుర్ఘటన


బాంబు పేలడంతో ఛిద్రమైన గోమాత దవడ భాగం

తగరపువలస: భీమిలి మండలం పాత మూలకుద్దుకు చెందిన కర్ణపు లక్ష్మణకు చెందిన నాలుగు మాసాల చూడి ఆవు సోమవారం సమీపంలోని చిప్పాడ కొండకు మేతకు వెళ్లి వేటగాళ్లు అమర్చిన నాటు బాంబుకు దవడ, నాలుక ఛిద్రమై విలవిల్లాడింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రోజూ మాదిరిగానే పాత మూలకుద్దు రైతులు తమ పాడి ఆవులను ఆర్‌కే లే అవుట్ మీదుగా చిప్పాడ కొండకు మేతకు వదిలారు. అవి సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకుంటాయి. మధ్యాహ్నం వేళ ఒకసారి వెళ్లి వాటి యజమానులు చూసి వస్తుంటారు. అదేవిధంగా సోమవారం మధ్యాహ్నం లక్ష్మణ ఆర్‌కే లే అవుట్ మీదుగా తమ పశువులను చూడటానికి వెళ్తుండగా... రక్తపు మడుగులో తన చూడి ఆవు విలవిల్లాడుతూ కనిపించడం చూసి పులి, ఎలుగుబంటి, అడవి పంది లాంటి క్రూరమృగాలు దాడి చేసి ఉంటాయని భావించారు. తర్వాత అతి కష్టం మీద ఆవును ఇంటికి తీసుకొచ్చారు. ఆవు శరీరంపై ఎక్కడా గాయం, రక్కుడు లాంటివి లేకపోవడంతో నాటు బాంబు పేలి ఈ దుర్ఘటన జరిగి ఉంటుందని నిర్ణయానికి వచ్చారు. ఆవు నోటిలో నాలుక, దవడ, దంతాలు ఛిద్రమై మాంస ఖండం కిందకు వేలాడుతుండటంతో ఆ మూగజీవి పడుతున్న వేదనను చూసి స్థానికులు కన్నీళ్లు పెట్టుకున్నారు. చిప్పాడ కొండపై అడవి పందులను వేటాడటానికి వేటగాళ్లు తరచూ నాటు బాంబులు అమరుస్తారని, వాటి బారిన పడి ఆవుకు ఈ దుస్థితి వచ్చినట్టు తెలుసుకుని స్థానికులు చలించుపోయారు. వైద్యానికి కూడా పనికిరానంతగా ఆవు ముఖ భాగం తయారైందని పశు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆవు పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రాంతంలో నాటు బాంబులు అమరుస్తున్న వేటగాళ్లపై చర్యలు తీసుకోవాలని స్థానిక పాడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వీఏఏల సూచనలు పాటించాలి


కృష్ణాపురంలో మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి ఎంపీఎస్ చలం

పద్మనాభం: గ్రామ వ్యవసాయ సహాయకుల (వీఏఏ) సూచనల మేరకే రైతులు పురుగు మందులు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం సూచించారు. మండలంలోని కృష్ణాపురంలో మొక్కజొన్న, రాగి పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం పంటలు ఆరోగ్యకరంగా ఉన్నాయన్నారు. చీడపీడలు ఆశిస్తే రైతు భరోసా కేంద్రంలో ఉండే వ్యవసాయ శాఖ సహాయకులను సంప్రదించాలన్నారు. పురుగు మందులు కావాలన్నా రైతు భరోసా కేంద్రంలో తగిన సొమ్ము చెల్లిస్తే నాణ్యమైన మందులు అసలు ధరకు లభిస్తాయని తెలిపారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు కనిపిస్తే ఇమామెక్టిన్, బెంజాయేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. రబీ సీజన్‌లో వేసిన పంటలకు రైతులు ఈ క్రాఫ్ చేయించాలని సూచించారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న రామాయణం నాటకం


రామాయణం నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

కొమ్మాది: అయోధ్యలో రామయ్య విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని బీచ్‌రోడ్డు సాగర్ నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో సోమవారం నిర్వహించిన సంపూర్ణ రామాయణం నాటకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దాదాపు 40 పాత్రలతో, చక్కని అలంకరణతో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రదర్శించిన ఈ నాటకం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

దైవానుగ్రహంతో ఉత్తమ ఫలితాలు


పూజలో తిరుమల విద్యా సంస్థల ప్రతినిధులు

తగరపువలస: త్వరలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి దైవానుగ్రహం అవసరమని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. సోమవారం తమ వివిధ క్యాంపస్‌లలో లక్ష్మీ గణపతి పూజ, జ్ఞాన సరస్వతీ హోమం డైరెక్టర్లతో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజల్లో సిబ్బంది, విద్యార్థులు, డైరెక్టర్లు కె.ఎస్.వి.వి.సత్యనారాయణ దంపతులు, ఎం.సత్యనారాయణ, ఇ.మృత్యుంజయరావు, జి.సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తునివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

పద్మనాభం: మండలంలోని తునివలసలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నామని ఎంపీడీవో బి.శైలజ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు శిబిరం కొనసాగుతుందని ఆమె తెలిపారు. రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9న డీ వార్మింగ్ డే


జీవీఎంసీ అధికారులకు మాత్రలు అందజేస్తున్న సీహెచ్‌వో సౌభాగ్యమణి

మధురవాడ: నులి పురుగుల నివారణకు ఈ నెల 9న డీ వార్మింగ్ డే నిర్వహిస్తున్నట్టు మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో సౌభాగ్యమణి చెప్పారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో ఈఈ శాంతి, సూపరింటెండెంట్ అప్పలరాజు ద్వారా సిబ్బందికి మాత్రలు సోమవారం అందజేశారు. డీ వార్మింగ్ డే విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, ఇతర సిబ్బంది వివిధ పాఠశాలల పిల్లలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

ఆధునిక టెక్నాలజీపై వర్క్‌షాప్

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జీవశాస్త్రం ఉపాధ్యాయులకు ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. చినగదిలి, పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆధునిక టెక్నాలజీ ద్వారా బోధన, కొత్త యాప్స్‌పై రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ కల్పన అవగాహన కల్పించారు. కోర్స్ డైరెక్టర్‌గా చంద్రంపాలెం ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు వ్యవహరించారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత మిందివానిపాలెం జట్టు


మిందివానిపాలెం జట్టు సభ్యులు

ఆనందపురం : మండలంలోని తర్లువాడలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మజ్జి అప్పారావు జ్ఞాపకార్థం నిర్వహించిన ఎంఏఆర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా మిందివానిపాలెం జట్టు నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో 44 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌కు చేరిన తర్లువాడ, మిందివానిపాలెం జట్లు సోమవారం తలబడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన మిందివానిపాలెం జట్టు నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 61 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన తర్లువాడ జట్టు 40 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో మిందివానిపాలెం జట్టును విజేతగా ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు మాట్లాడుతూ ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. త్వరలో బహుమతుల ప్రధాన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు.

385 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు


చిప్పాడలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యురాలు శోభారాణి

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యురాలు శోభారాణి సోమవారం చిప్పాడ, కొసనవానిపాలెం, సిటీనగర్, కంచేరుపాలెం ప్రాథమిక పాఠశాలలకు చెందిన 385 మంది విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వారికి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కలిగించారు. ఆహార నియమాలు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రత్నం, సర్పంచ్ వెంపాడ రమావతి, సూరిబాబు, రాజారెడ్డి, సీఎస్ఆర్ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్, కె.నరసింహ, పి.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అతివేగం వల్లే ప్రమాదాలు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై సోమవారం అవగాహన కల్పించారు. భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డీటీసీ రాజారత్నం మాట్లాడారు. వేగంగా వాహనాలు నడపడం వల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనం నడిపేటప్పుడు రోడ్డుపై దృష్టి సారించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడపడం, ద్విచక్ర వాహనాల రేసింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు గణేష్‌రెడ్డి, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాత సత్యనారాయణ రాజుకు అవార్డు


ప్రశంసాపత్రం, అవార్డుతో సత్యనారాయణరాజు

పద్మనాభం : ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తిరుపతిలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డు పురస్కారాల ప్రధానోత్సవాల్లో భాగంగా 'ఒకడే వీరుడు అల్లూరి సీతారామరాజు' చిత్ర నిర్మాత ఆర్ ఎస్ సత్యనారాయణ రాజుకు ఉత్తమ బయోపిక్ ప్రొడ్యూసర్ అవార్డు అందజేశారు. పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ కురపల్లికి చెందిన రాజసాగి సత్యనారాయణరాజు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను, జీవితంలో జరిగిన సంఘటనలను వాస్తవాలకు దగ్గరగా నిర్మించినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు.

నైపుణ్య పెంపుపై విద్యార్థులు దృష్టి పెట్టాలి


ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ నైపుణ్యం పెంపు దృష్టి పెట్టాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి సూచించారు. ఏయూ బయోటెక్నాలజీ, టీ కాబ్స్–ఈ సంయుక్త నిర్వహణలో మూడు రోజుల రాష్ట్ర స్థాయి జీవ సదస్సు(ది ఆంధ్రా బయో సమ్మిట్)ను ఆయన సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 400 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులను విశ్వవనరులుగా తీర్చిదిద్దడంలో ఏయూ ముందంజలో ఉందన్నారు. విద్యార్థులు తమ నైపుణ్య ప్రత్యేకతను చాటాలన్నారు. ప్రయోగాత్మక, ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందడానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, బయోటెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మీ, చైర్ ప్రొఫెసర్ పి.ఎస్.పి.ధనుంజయ్, ఆచార్య పద్దయ్య, టి.క్యాబ్స్–ఈ వ్యవస్థాపకుడు డాక్టర్ రవి, ఆచార్య సుజాత పాల్గొన్నారు.

కుటుంబ డాక్టర్ విధానం భేష్


వైద్య సిబ్బందితో చర్చిస్తున్న డిఫెన్స్ అధికారులు

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు డిఫెన్స్ అధికారుల కితాబు

ఆనందపురం : కుటుంబ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉందని డిఫెన్స్ అధికారులు కితాబు ఇచ్చారు. ఎన్‌డీసీ సీనియర్ డైరెక్టర్ ఎం.కె. ఏవీఎస్ ఆధ్వర్యంలో జాతీయ రక్షణశాఖ కళాశాల నుంచి 15 మంది డిఫెన్స్ అధికారులు మండలంలోని వేములవలసలో ఉన్న వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ (ఆయుష్మాన్ భారత్)ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ డాక్టర్ విధానం వలన ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఇంటికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులకు తనిఖీలు, మందులు పంపిణీ, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షలు వరకు ఉచితంగా శస్త్ర చికిత్సలు, వైద్యసేవలు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్టు పథకాలు అమలు తీరుని పరిశీలిస్తే అవగతమవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్‌లోని సౌకర్యాలు, మందుల నిల్వలు, సంచార వైద్య వాహనాన్ని పరిశీలించారు. సిబ్బందితో సమావేశమై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా వైద్య సేవలు సంపూర్ణంగా అందించడానికి సిబ్బందితో పాటు మందులు కూడా అందుబాటులో ఉన్నాయని సిబ్బంది, డిఫెన్స్ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ఉమాపతి, కోరాడ రాజబాబు, వైద్యురాలు షహనాజ్ సాదియా, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, డీపీఎంవో జె.భీమేశ్వరరావు, సీహెచ్‌వో గంటా సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పీఎం పాలెం : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ మోగదారమ్మ ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే ప్రాంతాల్లో లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్ జోన్ – 3 డీఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 7వ వార్డులోని ఆర్టీసీ డిపో ఏరియా, కృషి షాపింగ్ మాల్, పాత మధురవాడ మెట్ట, సినీ పోలీస్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని జై భారత్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం భీమిలి నియోజకవర్గ కన్వీనర్ ఇల్లిపిల్లి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొన్ని పార్టీల నాయకులు పొత్తులు, సీట్ల పంపకాలుకోసం ఆలోచిస్తుంటే... తాము మాత్రం ప్రజల కోసం పార్టీ మ్యానిఫెస్టో తయారు చేస్తున్నామని పేర్కొన్నారు. కొందరు ఎప్పటికప్పుడు పార్టీలు, సిద్ధాంతాలు మార్చేస్తున్నారన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం జంతర్ మంతర్ వద్ద తాము ధర్నా చేయనున్నట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

పీఎం పాలెం : పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎండాడలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా మాచెర్ల ప్రాంతానికి చెందిన బీమబోయిన చెన్నకేశవ (24) ఉద్యోగం కోసం నెల రోజుల కిందట నగరానికి వచ్చాడు. అప్పటి నుంచి ఎండాడ దుర్గాలమ్మ కోవెల సమీపంలో ఉన్న బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆ ప్రయత్నాలు ఫలించక పోవడంతో జీవితంపై విరక్తి చెంది తాను చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు ఉత్తరం రాసి గదిలో ఉరేసుకున్నాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

కనక మహాలక్ష్మి నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం


ఈవో శిరీషకు చెక్కు అందజేస్తున్న హరితరెడ్డి కుటుంబ సభ్యులు


విజయలక్ష్మి తరపున తిరుమలేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న భక్తుడు

డాబాగార్డెన్స్ : కనక మహాలక్ష్మి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు దాతలు విరాళం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీషకు విశాఖ నగరానికి చెందిన ఎస్.హరితరెడ్డి (హెచ్‌ఐడబ్ల్యూఏజీఏ సంస్థలు) కుటుంబ సభ్యులు రూ.లక్షా 116 సోమవారం అందజేశారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావుకు బి.విజయలక్ష్మి తరపున భక్తుడు రూ.లక్షా 116 అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వీరిచే అమ్మవారికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ప్రసాదం అందజేశారు.

'స్పందన' వినతుల పరిష్కారానికి కృషి


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ శైలజవల్లి

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయంలో జెడ్సీ శైలజవల్లి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ఆరు వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మూడు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాలకు సంబంధించి ఒక్కో వినతి వచ్చింది. వీటిని పరిశీలించి తగిన విధంగా పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2లో సోమవారం నిర్వహించిన స్పందనకు 3 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఈఈ శాంతి రాజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రేవళ్లపాలెం ఆర్‌కే రత్నం ఎన్‌క్లేవ్ వద్ద రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పి.రూప కోరారు. ఎండాడ శాంతి నగర్ వద్ద వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్టీఐ ద్వారా అడిగిన సమాచారం కూడా అధికారులు సక్రమంగా ఇవ్వడం లేదని రామ్‌తేజ్ ఎన్‌క్లేవ్‌కి చెందిన కాశీవిశ్వనాథం వాపోయారు. కొమ్మాది విజయనగరం టీచర్స్ లే అవుట్‌లో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. వివిధ సమస్యలపై 8 అర్జీలు వచ్చాయి. సమస్యలన్నీ పరిష్కరిస్తామని శాంతి రాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మకు అభిషేకం


అభిషేకం నిర్వహిస్తున్న జానకీరామ్

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో ఏపీ మర పడవల సంఘం ఆధ్వర్యంలో శ్రీ జటా గంగేశ్వర రాజ్య శ్యామల అమ్మవారి యజ్ఞం దేదీప్యమానంగా జరిగింది. ఆదివారం మొదలైన ఈ యజ్ఞ ప్రక్రియ మంగళవారం వరకు కొనసాగుతుంది. సోమవారం ఏపీ మర పడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ఆధ్వర్యంలో బోటు యాజమానులు శాంతి హోమం, పరమశివునికి, గంగమ్మ తల్లికి సహస్ర కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. మంగళవారం గంగేశ్వరునికి సహస్ర కలశాభిషేకం జరుగుతుందని, ఈ అభిషేకంలో హార్బర్‌లో ఉన్న పరిశ్రమ ప్రముఖులు పాల్గొంటారని జానకీరామ్ తెలిపారు. మంగళవారం శ్రీ చక్ర మహా యజ్ఞం నిర్వహించి... అనంతరం ఊరేగింపుతో హార్బర్ వేలం కేంద్రం వద్ద గంగా హారతి గంగమ్మకు, రుద్ర రాజేశ్వరునికి, రాజ్య శ్యామలదేవికి సహస్ర కలశాభిషేకం తర్వాత మహాయజ్ఞం పూర్తవుతుందని తెలిపారు. మంగళవారం గంగమ్మతల్లికి శాంతి హోమం ముగింపు సందర్భంగా ఫిషింగ్ హార్బర్‌లో ఎటువంటి కార్యకలాపాలు జరగవని తెలియజేశారు.